సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 31 । జనవరి । 2025



యథేచ్ఛగా మద్యం..

గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మందుబాబుల ఆగడాలు పెరిగిపోయాయి. 8లో▸



కొడంగల్‌ను ఆదర్శంగా..

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. 8లో▸



ఉచిత కంటి వైద్య శిబిరం

పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం వడ్డించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్



వంట తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాష్‌రూంను ప్రతి రోజు శుభ్రం చేయాలన్నారు. స్టోర్ రూంలోని బియ్యం నాణ్యతను గమనించారు. బియ్యం సరిగ్గా లేకపోతే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి మార్చుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలన్నారు. లైట్లు, ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

స్పీకర్ ప్రసాద్ కుమార్



శివకుమార్‌ను సన్మానిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్ తదితరులు

నవాబుపేట: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఎకమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన శివ కుమార్ వికారాబాద్‌లోని బసంత్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయ పాత్ర ఎంతో కీలకమన్నారు. శివకుమార్ ఉపాధ్యాయునిగా పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడిగా మంచి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, కాటేపల్లి జనార్దన్ రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు డిప్యూటీ తహసీల్దార్ సస్పెన్షన్

పూడూరు: భూముల రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు పాల్పడినందుకు పూడూరు డిప్యూటీ తాహసీల్దార్ కిషోర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సిహెచ్.కిషోర్ మండలంలోని చనుగోముల్ గ్రామం సర్వే నెంబర్ 496లో 1,022 ఎకరాల భూమికి సంబంధించి ధరణిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ కారణంగా ఆయనను విధుల నుంచి తప్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సస్పెన్షన్ కాలంలో కిషోర్ ముందస్తు అనుమతి లేకుండా కార్యాలయాన్ని వదిలి వెళ్లరాదని కలెక్టర్ ఆదేశించారు.

కౌన్సిల్ మాజీ సభ్యులకు ఘనంగా వీడ్కోలు



తాండూరు: పదవీకాలం ముగిసిన మున్సిపల్ పాలక వర్గానికి గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విక్రంసింహారెడ్డి ఆధ్వర్యంలో మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, మాజీ కౌన్సిలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నీరజా బాల్‌రెడ్డి, అబ్దుల్ రజాక్, వరాల శ్రీనివాస్‌రెడ్డి, రత్నమాల నర్సింహులు, భీంసింగ్ రాథోడ్, ప్రవీణ్‌గౌడ్, సాహు శ్రీలత, అంతారం లలిత, బొబ్బిలి శోభారాణి, బాంబానా, వెంకన్నగౌడ్, రామకృష్ణ, బోయ రవిరాజ్, సల్మాఫాతిమా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా పురసేవలు

సమస్యలపై అధికారులు, సిబ్బంది తక్షణం స్పందించేలా చూస్తాం

- అర్హులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నదే లక్ష్యం
- స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులు లేనిలోటు రానివ్వం
- అధికారుల హాజరుపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నాం
- 'సాక్షి'తో మున్సిపాలిటీల ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ సుధీర్



అడిషనల్ కలెక్టర్ సుధీర్

వికారాబాద్: ''పౌర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం.. ప్రజలకు దగ్గరగా ఉంటూ సేవ చేసే మంచి అవకాశంగా వచ్చిందని భావిస్తున్నా.. ఒకే సారి ఏడు బాధ్యతలు నిర్వహించడం కొంత పని భారం అయినా ఇష్టంతోనే సేవలు అందిస్తున్నా.. అధికారులు కూడా ఒత్తిడికి లోనవకుండా మోటివేషన్ చేస్తున్నాం.. కలెక్టర్ సూచనలతో బాధ్యతగా ముందుకెళ్తున్నాం'' అని మున్సిపాలిటీల ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) సుధీర్ అన్నారు. జెడ్పీ సీఈఓగా.. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా, వికారాబాద్ మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా.. తాజాగా నాలుగు మున్సిపాలిటీల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది. ఆయన మాటల్లోనే..

శాఖల సమన్వయంతో..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. సంబంధిత అధికారులు, శాఖలను సమన్వయం చేస్తూ ముందుకెళ్తున్నాం. విధానపరమైన అంశాల జోలికి వెళ్లకుండా పథకాలు సమర్థవంతగా అమలయ్యేలా అధికారులను సమాయత్తం చేస్తున్నాం.

అన్నీ ఒకే తరహా బాధ్యతలు కావడంతో..

నేను జెడ్పీ సీఈఓ పోస్టుతో పాటు అదనపు బాధ్యతలు వహిస్తున్నా.. మిగతావి కూడా ఒకే గొడుగు కిందకు వచ్చేవి.. ఒకే రకమైన పని విధానంతో ముడిపడి ఉన్నవి కావడం కొంత వెసులుబాటు కలిగిస్తోంది. నాకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలన్ని స్థానిక సంస్థలకు సంబంధించినవే కావటం కలిసొచ్చే అంశంగా భావిస్తున్నా..

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రస్తుతం స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులు లేరు.. వారి లేని లోటు పూడ్చటం అంతా ఈజీ కాదు.. అయితే వారికి ప్రత్యామ్నాయ వ్యవస్థలుగా కాకుండా వారందించే సేవల్లో ఇబ్బందులు లేకుండా, లోటు తెలియకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఇదే సమయంలో అధికారులు, యంత్రాంగంతో పని తీసుకునే విషయంలో యాజమాయిషి ధోరణి కాకుండా వారిని మోటివేట్ చేసేలా ముందుకెళ్తున్నాం. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు తమకు బాగా సహకరిస్తున్నారు. ప్రధాన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సేవల్లో రాజీపడం

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పౌర సేవలు అందించే విషయంలో ఎలాంటి రాజీ పడం. అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, వీధి లైట్లు వంటి వాటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నాం. అధికారుల హాజరుపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించేలా అధికారులను అప్రమత్తం చేస్తూ ముందుకు సాగుతున్నాం.



కేరళ గవర్నర్‌కు మొక్కను బహూకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

❖ ఆతిథ్యం

కొడంగల్: కర్ణాటక రాష్ట్రం వెళ్తున్న కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ గురువారం కొడంగల్‌లో కాసేపు ఆగారు. కడా కార్యాలయం వద్ద కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం కడా కార్యాలయంలో గవర్నర్‌కు అల్పాహారంతో ఆతిథ్యం ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌తోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అస్సాం డిప్యూటీ స్పీకర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

❖ సన్మానం

పూడూరు: హైదరాబాద్ నుంచి కర్ణాటక వెళ్తున్న అస్సాం డిప్యూటీ స్పీకర్ డాక్టర్ నుమల్ మోమిన్‌ను పట్టణంలో సినిమా సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేష్ పటేల్ స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై మంచి ఆదరణ ఉందన్నారు. బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేష్‌ను సన్మానించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, పూడూర్ మండల ఉపాధ్యక్షులు కృష్ణాచారి, నర్సింహ, బీజేవైఎం మండల అధ్యక్షులు పాండు, గీత సెల్ కన్వీనర్ ప్రసాద్ గౌడ్, బూత్ అధ్యక్షులు మహేష్, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



పోలీస్ పరేడ్‌లో ఎస్పీ నారాయణరెడ్డి

ప్రజలతో మమేకం కండి

ఎస్పీ నారాయణరెడ్డి

బంట్వారం: పోలీసులు ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీగా పని చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఆయన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల స్థితిగతులపై ధారురు సీఐ రఘురాములు, స్థానిక ఎస్సై గఫార్‌కు సూచనలు చేశారు. ఎట్టిపరిస్థితుల్లో కేసులను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. నేరం చేసిన వారు తప్పించుకోకుండా దర్యాప్తు చేయాలన్నారు. పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా మరింత చేరువ కావాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని అవసరం ఉన్న సమయంలో ఉపయోగించాలన్నారు. నేరాల నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని అందుకు అనుగుణంగా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. నిత్యం వాహనాలు తనిఖీ చేయాలని బ్లూ కోల్ట్స్ పెట్రోల్ కారు విధులు నిర్వహించే వారు విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే అదుపులోకి తీసుకొని పూర్తి సమాచారం సేకరించాలని ఆదేశించారు. అక్రమ రవాణా, వ్యాపారులపై నిఘాను పటిష్టం చేయాలన్నారు. సమస్యలు సృష్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే రౌడీ షీట్స్ ఓపెన్ చేయాలని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాములు, కోట్‌పల్లి ఎస్సై అబ్దుల్ గఫార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

- జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి డీజీ శీతల్

అనంతగిరి: లైంగిక వేధింపులపై మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ శీతల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లైంగిక వేధింపులు, మహిళల హక్కులపై వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో మహిళలకు అనేక హక్కులు కల్పించారని, వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నట్లయితే అంతర్గత, స్థానిక ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, సాంఘిక మాధ్యమాల్లో అసభ్య మెసేజ్, పోస్టులు చేయడం, వీడియోలు పంపడం, వీడియో కాల్ చేయడం,స్క్రీన్ షాట్లు పోస్ట్ చేయడం వంటివి కూడా లైంగిక వేధింపుల చట్టం పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. దురుద్దేశంతో ఫిర్యాదు చేస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, కలెక్టరేట్ ఏవో ఫర్హీన్, లీగల్ ఎయిడ్ బార్ కౌన్సిల్ సభ్యులు టి.వెంకటేష్, రాము, శ్రీనివాస్, ప్యానెల్ అడ్వకేట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి డీబీ శీతల్

గాంధీ చూపిన బాటలో నడుద్దాం

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: మహనీయుల త్యాగమే మనం పొందుతున్న స్వాతంత్ర్య ఫలాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం, మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకుల నుంచి దేశ విముక్తి కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని అలాంటి వారికి స్మరించకోవాలన్నారు. 200 సంవత్సరాలు ఆంగ్లేయులు మన దేశాన్ని పాలించిన క్రమంలో సాయుధ పోరాటంతో పాటు శాంతియుత పోరాటాన్ని జరిపి స్వాతంత్ర్యాన్ని పొందామని ఆయన తెలిపారు. అల్లూరి సీతారామరాజు, మొదటి తుపాకి పట్టిన మంగలి పాండే, కొమరం భీమ్, దొడ్డి కొమరయ్య లాంటి వారు తమ ప్రాణాలు సహితం అర్పించారని తెలిపారు. నల్లజాతుల ప్రజల హక్కుల కోసం శాంతియుత పోరాటం చేసిన నెల్సన్ మండేలాను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, ఏఓ ఫర్హీన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్ తదితరులు

నేడు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తాండూరు రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యహ్నం 3 గంటలకు 112మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెక్కులు అందజేస్తారని తెలిపారు.

డీఆర్ యూసీసీ సభ్యుడిగా నరోత్తంరెడ్డి



అనంతగిరి: సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా వికారాబాద్‌కు చెందిన బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పట్లోల్ల నరోత్తంరెడ్డిని నియమించారు. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నరోత్తంరెడ్డి రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడానికి, రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి, రైల్వే అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని నరోత్తంరెడ్డి తెలిపారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ధారూరు: రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందడానికి కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు శుక్రవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులు ఆయా క్లస్టర్ ఏఈఓలకు తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుబుక్, పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ కాపీలను జత చేయాలన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



పరిగిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



వికారాబాద్‌లో మహాత్ముడి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

- మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్

పరిగి: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు అయిన సందర్భంగా గురువారం గాంధీ విగ్రహానికి హామీలు అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు హామీలను అమలు చేస్తున్నట్లు అధికారిక ప్రకటన చేసి విస్మరించారన్నారు. రైతు భరోసా అందిస్తామని చెప్పి మండలానికి ఒక్క గ్రామానికి అమలు చేస్తున్నట్టు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఒకేసారి నాలుగు హామీలు అమలు చేస్తున్నట్టు ప్రకటించిన సీఎం ఒక్క హామీ అమలు కాకపోవడంతో గ్రామాల్లో రైతులు, ప్రజలు ప్రభుత్వాన్ని ఛీకొడుతున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు బూటకపు మాటలు చెప్పి ప్రజల నుంచి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎందుకు అమలు చేయడం లేదన్నారు. సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కంకల్ ప్రభాకర్‌గుప్తా, రాజేందర్, తాహెర్, రవి, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో..

అనంతగిరి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలన ఎంతో ఆదర్శంగా సాగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సర్వేల పేరుతో పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, గోపాల్, అనంతరెడ్డి, రామస్వామి, కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, రాములు, లక్ష్మణ్, గయాజ్, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం లేకుండా ఆడిటింగ్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పరంగా పంచాయతీల నిర్వహణ, ఖర్చు పెట్టిన డబ్బులను అధికారులు దుర్వినియోగం చేయకుండా ఆడిటింగ్ చేయడం జరుగుతుందని జిల్లా ఆడిటింగ్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి గ్రామాల్లో అధికారులు గురువారం ఆడిటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామాల్లో ఖర్చు పెట్టిన పరిపాలనకు సంబంధించిన ఖర్చులను, ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 2024 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ పాలనలో ఖర్చు చేసిన నిధులు, వాటి బిల్లులను పరిశీలించి ఆడిటింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరిగినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ పంచాయతీ అధికారి సంధ్యారాణి, ఎన్కెపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి


రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

కుల్కచర్ల: రైతులు తమ సాగులో జీవ వైవిధ్యాన్ని కాపాడాలని జన్యు వనరుల పరిశోధన డైరెక్టర్ డా.జీ.పీ సింగ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో షెడ్యూల్ కులాల రైతులకు వ్యవసాయ పరికరాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నూతన పద్ధతులతో వ్యవసాయాన్ని కొనసాగించాలని సూచించారు. పాత పంటలను సాగుచేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా సహాయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్‌కే. కౌశిక్, శరవణన్, అనిత, ప్రసన్న, పరమేశ్వరి, భాస్కర్, ఎంపీ.రెడ్డి, ఆశరా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ లక్ష్మయ్య, కోఆర్డినేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మృతి


హన్మంత్ రెడ్డి (ఫైల్)

కుల్కచర్ల: పాంబండ ఆలయ మాజీ చైర్మన్ బిల్లకంటి హన్మంత్ రెడ్డి ఆకస్మికంగా మృతిచెందారు. గురువారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన హన్మంత్ రెడ్డి గతంలో పాంబండ ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. కాగా గురువారం మధ్యాహ్నం ఆయన గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మరణం పట్ల వివిధ పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

దుద్యాల్ ఎస్సైగా యాదగిరి



దుద్యాల్: మండల నూతన ఎస్సైగా యాదగిరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై భరత్ రెడ్డిని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై యాదగిరి మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

తైక్వాండోలో మెరిసిన వికారాబాద్‌వాసి


మెడల్ అందుకుంటున్న గోపాలకృష్ణ

అనంతగిరి: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన 13వ జాతీయ సీనియర్ పుంసే, ఏడో జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ లో వికారాబాద్ వాసి సత్తా చాటాడు. పట్టణానికి చెందిన గోపాలకృష్ణకు అండర్ 50 సంవత్సరాల విభాగంలో మూడో స్థానం నిలిచాడు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

పరిగి: ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ గోదాం దగ్గర కందుల కొనుగోలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.7550 కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కల్తీ అల్లం పేస్ట్ పట్టివేత

అనంతగిరి: పరిగి పట్టణంలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్సై ప్రశాంత్ వర్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో నమ్మదగిన సమాచారం మేరకు విఘ్నేశ్వర ట్రేడర్స్‌పై దాడులు నిర్వహించగా 80 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ పట్టుకొని సీజ్ చేయడంతో పాటు పరిగి పీఎస్ లో కేసు నమోదు చేశారు. జిల్లాలో ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాలు అమ్మినా, తయారు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్ : డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA (4 నెలల్లో పూర్తి) Dr.J.S అకాడమి (ISO 9001:2015 సర్టిఫైడ్) 8866977112 [HA-15420]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యథేచ్ఛగా మద్యం.. అడ్డుకోకపోతే అనర్థం

- మత్తులో తూగుతున్న మైనర్లు, యువత
- గ్రామాల్లో పెరిగిన వింత ధోరణి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

దుద్యాల్: గ్రామీణ ప్రాంతాల్లో మద్యం మత్తు గుప్పుమంటోంది. విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడంతో యథేచ్ఛగా మందుబాబులు తాగి తూగుతున్నారు. ఇందులో మైనర్లు సైతం అధికంగా ఉండడం ప్రస్తుతం కలవరపాటుకు గురి చేస్తోంది. ఆధునిక భారతంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంతో పాటు వింత పోకడలు సమాజంలో దర్శనమిస్తున్నాయి. వయసుతో సంబంధం లేకుండానే మద్యాన్ని ఆస్వాదించే ధోరణి ఎక్కువైంది. ఫలితంగా క్రైమ్ రేటు సైతం అదేస్థాయిలో పెరుగుతుంది. మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఒకరు.. భోజనం బాలేదని మరొకరు.. చిన్న చిన్న తగాదాలతో దాడులకు తెగబడుతున్న ఉదంతాలు అనేకం గ్రామాల్లో సాక్షాత్కరించబడుతున్నాయి. దుద్యాల్ మండలంలోనూ మైనర్లు మద్యం తాగి బీభత్సం సృష్టించిన ఘటనలు అనేకం ఉన్నాయి.

విపరీతంగా షాపులు

వాస్తవానికి మైనర్లకు మద్యం అమ్మడం, సరఫరా చేయడం నేరం. అమ్మకందారులకు వయసుపై అనుమానం వస్తే ఏదైన రుజువు చూపాలని అడగాలి. మద్యం దుకాణదారులకు గిరాకీ పెరగాలనే ఉద్దేశంతో ఎవరు వచ్చినా విక్రయిస్తున్నారు. చిన్న వయసులోనే అలవాటు పడి క్రమంగా బానిసలవుతున్నారు. మైనర్ల నుంచి మొదలుకొని యువత వరకు తాగడం అనేది సాధారణంగా మారింది. ప్రతి ఊరులో బెల్టు షాపులు, పట్టణాలలో ఎక్కడ


దుద్యాల్‌లో కిరాణ షాపులో మద్యం అమ్మకాలు

పడితే అక్కడ వైన్‌షాపులు ఉంటున్నాయి. అమ్మకాలు పెంచుకోవడానికి మద్యం దుకాణదారులు సిండికేట్‌గా మారి పల్లెల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. దీంతో ఎక్కువగా తాగి రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.

నేరాలకు ఆస్కారం

స్నేహితులతో సరదాగా అలవాటైన మద్యం.. క్రమంగా రోజువారి వ్యసనంగా మారుతుంది. దీంతో తాగడానికి డబ్బులు లేకపోవడంతో కుటుంబసభ్యులపై ఒత్తిడి చేయడం.. ఘర్షణ పడడం సార్వసాధారణమైంది. ఈ క్రమంలోనే దొంగతనాలు, చోరీలు, దోపిడీలు చోటు చేసుకుంటున్నాయి. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమా

లెక్క లేనన్ని బెల్టులు

మండల కేంద్రంలో మద్యం దుకాణం రాత్రి 8 గంటలకే బంద్ చేస్తున్నారు. ఆ తర్వాత గ్రామంలో మద్యాన్ని దాదాపు 20 బెల్టు షాపుల్లో అమ్ముతున్నారు. అలాగే మండల పరిధిలోని హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి, హస్నాబాద్, ఈర్లపల్లి, చిలుముల మైల్వార్ వంటి పెద్ద గ్రామాల్లో బెల్టు షాపులు లెక్కలేనన్ని ఉన్నాయి. హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో 30 వరకు బెల్టు షాపులు కొనసాగుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. విచ్చలవిడిగా మద్యం దొరకడంతో యువత మద్యానికి బానిసవుతుంది.



దాలకు మద్యపానం ఒక ప్రధాన కారణం. చిన్న వయసులోనే మద్యం, గుట్కా, పాన్ మసాల, ధూమపానానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. విచ్చలవిడి మద్యానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బాలుడిపై పిచ్చి కుక్క దాడి

పరిస్థితి విషమం

బంట్వారం: పిచ్చి కుక్క దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బంట్వారం మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజు లక్ష్మి దంపతుల కుమారుడు వడ్డె తరుణ్(6) బంట్వారం ఎస్‌కేబీ స్కూల్‌లో చదువుతున్నాడు. మధ్యాహ్నం ఆరుబయట ఆడుకుంటుండగా అటుగా వచ్చిన పిచ్చి కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. ఈ ఘటనలో తరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి పిచ్చికుక్కను కొట్టి చంపారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ మోహన్, పైలెట్ బాల్‌రాజ్ వెంటనే అక్కడికి చేరుకొని బాలుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం కూడా పిచ్చికుక్క దాడిలో ముగ్గురు గాయపడిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గాయపడిన బాలుడు

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


ఫిర్దోస్ బేగం (ఫైల్)

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటనపై కుటుంబీకులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై అబ్దుల్ గఫార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి గ్రామానికి చెందిన ఫిర్దోస్ బేగం(30) చిన్నప్పటి నుంచి మానసిక ఆరోగ్యం బాగోలేక ఇంట్లోనే ఉండేది. ఈ నెల 28 మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పరిసర ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బేగం తండ్రి కత్తీఫ్‌యూసుఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670034, 9177937263 నంబర్లను సంప్రదించాలన్నారు.

బస్సుల మధ్య ఇరుక్కున్న బైకు

త్రుటిలో తప్పించుకున్న బాలుడు

తాండూరు టౌన్: రెండు ఆర్టీసీ బస్సుల నడుమ బైకుతో సహా ఓ మైనర్ ఇరుక్కుపోయాడు. పెద్ద ప్రమాదం నుంచి ఆ బాలుడు త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ ఘటన తాండూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. కర్నూలు జిల్లాకు చెందిన అశోక్ తల్లిదండ్రులతో కలిసి పాలిషింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నాడు. గురువారం కొడంగల్ రోడ్డు మార్గం నుంచి బైకుపై తాండూరు పట్టణంలోని వస్తున్నాడు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి రాగానే ముందున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయాడు. ఇంతలో ఎదురుగా మరో ఆర్టీసీ బస్సు రావడంతో, రెండు బస్సుల మధ్య ఇరుక్కుపోయాడు. అప్రమత్తమైన బస్సు డ్రైవర్లు బస్సులను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కింద పడిన బాలుడికి కుడి కాలు విరిగింది. స్థానికులు వెంటనే క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

చెట్టు పైనుంచి పడి వలస కూలీ మృతి

తాండూరు టౌన్: చెట్టు పైనుంచి పడి వలస కూలీ మృతి చెందిన ఘటన తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా పెద్ద ఆదిరాల గ్రామానికి చెందిన తరుణ్ నాయక్(29) తన భార్య, కూతురుతో కలిసి 8ఏళ్ల క్రితం తాండూరుకు వచ్చాడు. రహమాన్ వద్ద కూలీగా పనిచేస్తున్న తరుణ్ నాయక్ స్థానిక పోస్టాఫీసులో ఆవరణలో చెట్టు కొమ్మలు నరికేందుకు గురువారం వచ్చాడు. చెట్టు పైకి ఎక్కి కొమ్మలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ క్రమంలో నల్లా పైపునకు తల బలంగా తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


తరుణ్ నాయక్(ఫైల్)


మృతదేహం

కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర


కంది కొనుగోళ్లను పరిశీలిస్తున్న నాఫెడ్ అధికారి

నాఫెడ్ అడిషనల్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌సింగ్

తాండూరు: రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకే కేంద్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని నాఫెడ్ అడిషనల్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన తాండూరు మార్కెట్ కమిటీని ఢిల్లీ బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలను తనిఖీ చేశారు. కంది ఉత్పత్తులకు మార్కెటింగ్ శాఖ కల్పిస్తున్న కనిష్ఠ, గరిష్ఠ, సగటు ధరలను అడిగి తెలుసుకున్నారు. తాండూరు కందిపప్పునకు భౌగోళిక గుర్తింపు లభించడంతో తాండూరు కందులకు డిమాండ్ ఉందని మార్కెటింగ్ శాఖ అధికారులు నాఫెడ్ అధికారికి వివరించారు. మార్కెట్‌లో ధర పడిపోతే ప్రభుత్వ మద్దతు ధరకు కందులను కొనుగోలు చేయాలని తాండూరు డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్యకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈసారి కంది పంట అధికంగా సాగు చేసే రాష్ట్రాలలో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కంది పంట ఉత్పత్తులు వస్తున్నాయన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ అధికారులు తదితరులున్నారు.

ఫార్మాసిటీ కాదు.. ఫ్యూచర్‌సిటీ


భూ బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- అన్నదాతలు ఆందోళన చెందొద్దు
- ఎవరికీ అన్యాయం జరగనివ్వం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఫార్మాసిటీ రద్దయినట్లే. ఇక అది ఫ్యూచర్‌సిటీనే. ఫార్మాసిటీ వస్తుందని ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. గత ప్రభుత్వం.. ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వలేదని, రాత్రికిరాత్రే ధరణి పోర్టల్‌లో టీజీఐఐసీ పేరిట తమ భూములను మార్చి తీవ్ర అన్యాయం చేసిందని భూ బాధితులు పేర్కొన్నారు. ఐదేళ్లుగా రైతుబంధు, బ్యాంకు రుణాలు, క్రయ, విక్రయాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

మాటిస్తే తప్పం

మళ్లీ ఫార్మాసిటీ వస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని, ఈ ప్రాంతం ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. టీజీఐఐసీ పేరు మీద మార్చిన పట్టా భూముల రికార్డులను లీగల్‌గా పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో పేర్లున్న అన్నదాతలకు రైతు భరోసా అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఏ రైతుకు అన్యాయం జరగనీయమని, కాంగ్రెస్ మాటిస్తే తప్పదని స్పష్టంచేశారు.

కలెక్టర్‌కు రైతుల విజ్ఞప్తి

భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డిని రైతులు కోరారు. ఎమ్మెల్యేతో సమావేశం అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన పాలనాధికారి.. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్, టీజీఐఐసీ అధికారులతో సమావేశం తరువాత సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు అన్నదాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమేష్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గణేశ్, మహిపాల్‌రెడ్డి, నిరంజన్, వినోద్‌రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు తప్పనిసరి

ఎంవీఐ వీరేందర్‌నాయక్


మాట్లాడుతున్న వీరేంద్రనాయక్

పరిగి: రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని పరిగి ఎంవీఐ వీరేంద్రనాయక్ అన్నారు. 36వ రోడ్డు భద్రత మాసోత్సవాలల్లో భాగంగా గురువారం పట్టణ కేంద్రంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రతి ఒక్కరు వాహనాలను నడపాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలతో ట్రాఫిక్ నిబంధనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా తమ కుటుంబంలోని ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం తాగి వాహనాలను నడపం ద్వారా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ కిశోర్, సిబ్బంది పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలెపల్లి జాతర వేలం

దుద్యాల్: మండల పరిధిలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవాలయంలో వచ్చే నెల 20 నుంచి మార్చి 7 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన లక్షలాది భక్తులు జాతరకు వస్తుంటారు. ఇందుకుగాను గురువారం వివిధ పనులకు వేలం నిర్వహించారు. జాతరలో టెంకాయల అమ్ముకోవడానికి రూ.5.51 లక్షలతో గండీడ్ మండలం జిన్నారం గ్రామానికి చెందిన రవి కుమార్, మార్చి 8 నుంచి సంవత్సరం వరకు రూ.11.67 లక్షలకు మహబుబ్‌నగర్‌కు చెందిన అశోక్ వేలంలో దక్కించుకున్నారు. అలాగే బ్రహ్మోత్సవాలతో పాటు సంవత్సరం మొత్తం పులిహోర, లడ్డూ అమ్మకాలకు రూ.4.25 లక్షలకు పోలెపల్లి గ్రామానికి చెందిన రెబ్బని రాములు వేలం దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈసారి అన్ని వేలంలో ఎక్కువ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఈఓ నరేందర్, ఎల్లమ్మ దేవాలయం చైర్మన్ రాములు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.


వేలంలో ఆలయ ఈఓ, కమిటీ సభ్యులు

అపార్ ప్రక్రియ పూర్తి చేయండి


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి రాంకిశోర్

జిల్లా సెక్టోరియల్ అధికారి రాంకిశోర్

బొంరాస్‌పేట: విద్యార్థికి ప్రత్యేకంగా ఐడీ కేటాయించి పూర్తి వివరాలు సేకరించే అపార్ వందశాతం పూర్తిచేయాలని జిల్లా సెక్టోరియల్ రాంకిశోర్ గురువారం సూచించారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా అపార్‌పై హెచ్‌ఎంల సమావేశాలు ఉంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. మండలంలో అపార్ ప్రక్రియ 40కు తక్కువ ఉన్న పాఠశాలల్లో వేగవంతం చేయాలని సూచించారు. విద్యార్థుల పుట్టిన తేది, ఆధార్ సమస్యలు ఉన్న వాటిని వెంటనే చేయించాలన్నారు. పేరెంట్ నుంచి ఒకరి ఆధార్ తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్, క్లస్టర్ హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, హెచ్‌ఎంలు ఎమ్మార్సీ కంప్యూటర్ ఆపరేటర్ గౌసోద్దీన్, సీఆర్పీలు సోమ్లా, శంకరయ్య, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యాలపై చర్యలకు ఫిర్యాదు

చేవెళ్ల: హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అల్లి దేవేందర్, బస్సు డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడు కిష్టయ్య కోరారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు ముందుగా మండల కేంద్రంలో ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కొన్ని ప్రైవేట్ స్కూళ్ల బస్సు డ్రైవర్ల లైసెన్స్‌లపై సమావేశంలో చర్చించారు. వేతనాలు తక్కువగా ఇచ్చి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోయినా వారితో బస్సులు నడిపిస్తున్నారని, అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైవింగ్‌లో అనుభవం ఉన్నవారే నడిపించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులకు తీరని అన్యాయం చేసిన వారమవుతామని చెప్పారు. డ్రైవర్ల యూనియన్ రూల్స్ ప్రకారం డ్రైవర్లు అంతా నడుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో డ్రైవర్లంతా కలిసి ఏకగ్రీవంగా ఈ తీర్మానం చేసినట్లు చెప్పారు. ఏ పాఠశాలలో అయినా హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా బస్సులు నడిపిస్తే చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి యూనియన్ రూల్స్ గురించి తెలియజేసినట్లు చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలు కూడా ఆయా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ మండల ఉపాధ్యక్షుడు సురేందర్, సహాయ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, రమేశ్, వినోద్, హరికృష్ణ, పాండు తదితరులు ఉన్నారు.


ఎస్ఐకి ఫిర్యాదు అందిస్తున్న దేవేందర్, యూనియన్ నాయకులు

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


కొడంగల్: తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొడంగల్: కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.5వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాను విస్తరించనున్నట్లు చెప్పారు. పాఠశాలలకు అదనపు తరగతి గదులు నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరఫీ, పారామెడికల్ కళాశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు ప్రభుత్వం రూ.344 కోట్లు మంజూరు చేసిందన్నారు. పాఠశాల భవనాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులందరికీ వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంఈఓ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, నాయకులు సోమశేఖర్, దాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

దుద్యాల్: ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో తాత్కాలిక భవనంలో మండల పరిషత్ కార్యాలయాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. బొంరాస్‌పేట్ మండల ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న మహేశ్‌కుమార్ దుద్యాల్ ఎంపీడీవోగా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అనంతరం మండలంలోని 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొంరాస్‌పేట్ ఎంపీడీవో వెంకన్న గౌడ్, తహసీల్దార్ కిషన్, వ్యవసాయ అధికారి హిమబిందు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దుద్యాల్: మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి, అధికారులు

పరామర్శ

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు తుంకమెట్లకు చెందిన హనీఫ్‌కు మాతృ వియోగం జరిగింది. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని చెప్పారు.